మనూలో ఐడీపీ వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నిరంతరం పనిలో నైపుణ్యం పెంచుకుంటూ పోవాలని, ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో ఇతరులతో పోల్చితే ఓ అడుగు ముందుండాలని కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వి వెంకయ్య అన్నారు. యూజీసీ ఎంఎంటీటీసీ, ఐక్యూఏసీ సంయుక్త ఆధ్వర్యంలో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దు యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ (ఐడీపీ) కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎన్‌ఈపీ (కొత్త విద్యావిధానం) అమలు చేయడం ద్వారా ఎంతో అభివృద్ధి ఉంటుందన్నారు. ఏఐ, ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, రంగాల్లో మరింత పురోగతి సాధించాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సల్మాఅహ్మద్ ఫారూకీ, డాక్టర్ సయ్యాద్ అహ్మద్‌తోపాటు ఇతర అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

హైదర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అవంతినగర్‌కాలనీలో బీజేపీ మూసాపేట్ డివిజన్ కార్యవర్గ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కోడిచర్ల మహేందర్ హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి రావడం మనకి గర్వకారణమన్నారు. ఎంపీ ఎన్నికల్లో ఈటల రాజేందర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకున్నామని, ఈ విజయంలో భాగస్వాములైన కార్యకర్తలు, నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న కోటి కుంకుమార్చన

చందానగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్ లక్ష్మీగణపతి ఆలయంలో కోటికుంకుమార్చన కార్యక్రమం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. సోమవారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు కుంకుమార్చన కార్యక్రమం కొనసాగింది. అమ్మవారిని లక్ష్మీఅవతారంలో అలంకరించి పూజలు చేశారు. అనంతరం మంత్రపుష్పం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమానికి పటాన్‌చెరు, శేరిలింగంపల్లి నియోజకవర్గాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చికోటి కుంకుమార్చన మహాయజ్ఞంలో పాల్గొన్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ యువీ రమణమూర్తి, సభ్యులు ఏర్పాట్లను పరిశీలించారు.

సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగో ఆవిష్కరణ

రాయదుర్గం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ బ్రిలియన్స్ 2024 సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్‌ను అక్టోబర్‌లో నిర్వహిస్తున్నట్లు కళారాజ్ మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్‌మర్రి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం హైదరాబాద్ టీహబ్‌లో సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయర్స్‌తో కలిసి సోషల్ మీడియా స్టార్ ఫెస్టివల్ లోగోను ఆవిష్కరించారు. ఇన్‌ఫ్లూయెన్సర్ మీట్ అత్యంత ప్రతిభావంతులైన సోషల్ మీడియా వ్యక్తుల యొక్క ప్రత్యేక సేకరణ, పరిశ్రమలోని అత్యుత్తమ వ్యక్తులతో సమావేశం, సినీపరిశ్రమకు ప్రఖ్యాత కళాకారులు, దర్శకులు తమ అనుభవాలను పంచుకోవడంతో పాటు ఫిల్మ్‌మేకింగ్‌లో మెళకువలను వివరించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 16 నుంచి సెప్టెంబర్ 16 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

గౌరీనగర్‌లో కార్పొరేటర్ పర్యటన


గౌరీనగర్‌లో రోడ్ల పరిస్థితిని వివరిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్ గౌరీనగర్‌లో డ్రైనేజీ, అంతర్గత రోడ్ల పరిస్థితి ని తెలుసుకునేందుకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ డివిజన్ పరి ధి సోమవారం పర్యటించారు. రోడ్డు, డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. అస్తవ్యస్త రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్ తేజ, ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వీరేశ్, కర్రె జంగయ్య, కాలనీవాసులు రామకృష్ణ, చలం, మూర్తి, కృష్ణారావు, నజీర్, రమ్య, ప్రియ, లక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

మియాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాదాపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు టీవి మదనచారి, ఓబీసీ ప్రెసిడెంట్ సత్యంశ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు సంతోష్‌బాబు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రగుడ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి చూపు కాంగ్రెస్ వైపే ఉందని, కాంగ్రెస్ అందిస్తున్న ప్రజాపాలన, అభివృద్ధి చూసి పార్టీలో చేరుతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీని బలమైన శక్తిగా మారుస్తామన్నారు.

కేపీహెచ్‌బీలో సమస్యలను పరిశీలించిన ఎమ్మెల్యే

హైదర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం- పచ్చదనంలో భాగంగా కేపీహెచ్‌బీ కాలనీలోని మలేషియా టౌన్‌షిప్ ఐదెకరాల పార్కులో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు మొక్కలు నాటారు. అనంతరం వర్షం నీరు, డ్రైనేజీ, వన్‌సిటీ, లోధ, మలేషియన్ టౌన్‌షిప్ ప్రాంతాల్లో ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్ - 1, 3, 7లోని ధోబీఘాట్‌లను అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామని జడ్‌సీ అపూర్వచౌహాన్ తెలిపారు.

యువతి ఆత్మహత్య, నలుగురు నిందితుల అరెస్టు

మియాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ప్రైవేటు స్కూల్ కోచింగ్ సెంటర్‌లో వార్డెన్‌గా పని చేస్తున్న యువతి ఆత్మహత్య చేసుకుంది. మియాపూర్ పోలీసులు నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు సోమవారం తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా రాష్ట్రం బద్రాక్ జిల్లా భలేశ్వర్‌కు చెందిన రజనీమణి, మయదర్ భారీక్ దంపతుల కుమార్తె గీతాంజలి(21) మయూరినగర్‌లోని కోరుకొండా కోచింగ్ సెంటర్‌లో మూడేళ్ల నుంచి వార్డెన్‌గా పని చేస్తుంది. ఈక్రమంలో ఈనెల 8 అర్ధరాత్రి కోచింగ్ సెంటర్‌లో యువతి ఆత్మహత్య చేసుకుంది. దీనిపై కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కోచింగ్ సెంటర్‌లో సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్న నలుగురు నిందితులు యువతితో అసభ్యంగా ప్రవర్తించడంతో తీవ్ర మనస్థాపానికి గురై గీతాంజలి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. ఈ మేరకు నలుగురు అశీష్‌కుమార్(21), గౌతంకుమార్(21), శేఖర్(21), మిధున్‌కుమార్(30)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జగద్గిరిగుట్టలో జోరుగా బెల్టుషాపులు

జీడిమెట్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట ప్రాంతంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా నడుస్తున్నాయి. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో బెల్టుషాపులు నిర్వహిస్తున్నా పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఎలాంటి చర్యలూ చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. ప్రధానంగా కూన మహాలక్ష్మీనగర్‌లో రాము అనే వ్యక్తి బతుకమ్మ కుంట ఎదురుగా నిర్వహిస్తున్న బెల్టుషాపులు ఇరవైనాలుగు గంటలు తెరిచి వుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. అదేవిధంగా రాజీవ్‌గృహకల్ప, పలుబస్తీలలో విచ్చలవిడి మద్యం అమ్మకాలు సాగుతున్నాయని, ఈబెల్టుషాపుల్లో గంజాయికూడా విక్రయిస్తున్నారని, దీంతో యువత తప్పుదారి పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైలులో ప్రయాణికురాలి బ్యాగు చోరీ

బర్కత్‌పుర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రైలులో ప్రయాణికురాలి బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లిలో నివసిస్తున్న స్రవంతి కుటుంబ సభ్యులతో కలిసి ఔరంగాబాద్ వెళ్లింది. తిరుగు ప్రయాణంలో అజంతా ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కింది. నిజామాబాద్ వద్ద ఆమె బ్యాగును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. అందులో ఒకటిన్నర తులాల బంగారు నల్లపూసల గొలుసు, రెండు సెల్‌ఫోన్లు, 20 పౌండ్స్ విదేశీ కరెన్సీ ఉంది. బాధితురాలు సోమవారం కాచిగూడ చేరుకున్న తర్వాత రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ నిమిత్తం నిజామాబాద్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

పరిష్కారం కాని ప్రజావాణి ఫిర్యాదులు

● కుత్బుల్లాపూర్ జంటసర్కిళ్లలో అభాసుపాలవుతున్న కార్యక్రమం ● కృషి కాలనీలో రోడ్డు ఆక్రమణలపై చర్యలు శూన్యం

కుత్బుల్లాపూర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ జంటసర్కిళ్ల పరిధిలో ప్రజావాణి అభాసుపాలవుతోంది. ప్రజావాణిలో దరఖాస్తు ఇస్తే తమ సమస్యలు పరిష్కరిస్తారని కోటి ఆశలతో వస్తున్న ప్రజలకు నిరాశే ఎదురవుతోంది. సమస్యలపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పరిష్కారం కావడంలేదని పలుబస్తీల ప్రజలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి, నిర్లక్ష్యంపై సోమవారం జరిగిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదు అందాయి. ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్‌పై కూడా ఫిర్యాదులు అందాయి. సుభాష్‌నగర్ డివిజన్ కృషికాలనీలో గణేష్ బ్రదర్స్ బట్టల షాపు యజమాని రోడ్డు ఆక్రమించి భవన నిర్మాణం చేస్తున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సుభాష్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద ఇళ్లమధ్యలో పరిశ్రమలు ఉన్నాయని వాటితో ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఫిర్యాదు చేశారు. గాజులరామారం, జగద్గిరిగుట్ట, సూరారం, విశ్వకర్మకాలనీలలో అక్రమ నిర్మాణాలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీలు నర్సింహ, మల్లారెడ్డి, డాక్టర్ భార్గవ్‌నారాయణ, డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ లక్ష్మీగణపతి, ప్రభావతి పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌కు వినతిపత్రం ఇస్తున్న సమాఖ్య లీడర్లు, సీఐటీయూ నాయకుడు రాజశేఖర్

గౌరవ వేతనం ఇవ్వాలి

బాలానగర్: సమాఖ్య లీడర్లను కార్మికులుగా గుర్తించి వారికి గౌరవ వేతనం చెల్లించాలని కూకట్‌పల్లి నియోజకవర్గ సమాఖ్య లీడర్లు సోమవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయక కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆధ్వర్యంలో సమాఖ్య సభ్యులు అదనపు కలెక్టర్ డి.విజయేందర్‌కు వినతిపత్రం అందజేసి తమ సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో గణిత, సరస్వతి, అనంతలక్ష్మి, లలితకుమారి, లత, అనురాధ, హేమలత, లక్ష్మి, సంతోషి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణాన్ని చేపట్టాలి

ఫతేనగర్: ఫతేనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న రోడ్ల నిర్మాణాన్ని సత్వరమే పూర్తి చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ప్రజావాణిలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. భరత్‌నగర్ కాలనీ ఎల్ఐజీ, దీన్‌దయాల్‌నగర్, జవహర్‌నగర్, గౌతమీనగర్ ఎయిర్‌పోర్టు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, అస్తవ్యస్త రోడ్ల కారణంగా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని జడ్సీకి వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, నషఖాన్, డేవిడ్, సురేందర్‌నాయుడు కార్పొరేటర్ వెంట ఉన్నారు.

యువకుడు అదృశ్యం



రాయదుర్గం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మణికొండ పంచవటికాలనీకి చెందిన రాజు కుమారుడు పి.లచ్చన్న(19) (మానసిక దివ్యాంగుడు) ఈనెల 11న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గాలించారు. లచ్చన్న ఆచూకీ తెలియలేదు. దీంతో సోమవారం కుటుంబసభ్యులు రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

డ్రగ్స్ నివారణ కోసం కృషి చేయాలి


నిజాంపేట్, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిజాంపేట్‌లోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల విద్యార్థులతో బాచుపల్లి ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో డ్రగ్స్ కమిటీ సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సత్యనారాయణ మాట్లాడుతూ డ్రగ్స్‌ను నివారించడం అందరి బాధ్యతగా భావించాలన్నారు. 'మీ చుట్టుపక్కల ప్రాంతంలో ఎక్కడైనా డ్రగ్స్ ఆనవాళ్లు కనిపించితే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలి' అని తెలిపారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రాన్సిస్, డ్రగ్స్ కంట్రోల్ కమిటీ సభ్యులు శ్రీనివాస్, జార్జీ ప్రసన్న, శ్రీనివాసరావు, విద్యార్థులు ఉన్నారు.

● కావడియాత్ర


శ్రావణ సోమవారం సందర్భంగా జగద్గిరిగుట్ట నుంచి గాజులరామారం వరకు శివుని అభిషేకం కొరకు నీళ్లు తీసుకొని కావడి యాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి, భక్తులు.
- గాజులరామారం, ఆంధ్రజ్యోతి

ఇండియా ఎట్-100 పుస్తకావిష్కరణ

రాయదుర్గం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): భారతీయ ఆర్థిక వ్యవస్థలో సంస్కృతి, కట్టుబాట్లు వేల సంవత్సరాలుగా అనుసంధానమై ఉండటంతోనే కోవిడ్‌లాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా భారతీయ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలకుండా తటస్థంగా ఉందని సీఐఐ తెలంగాణ స్టేట్ కౌన్సిల్ చైర్మన్ ప్రసాద్ అన్నారు. ప్రధాన మంత్రి కార్యాలయంలో 17వ ఆర్థిక ముఖ్య సలహాదారుగా పనిచేసిన ఐఎస్‌బీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్ రచించిన 'ఇండియా ఎట్-100' పుస్తకాన్ని ఐఎస్‌బీ డీన్ ప్రొఫెసర్ మదన్, సీఐఐ తెలంగాణ కౌన్సిల్ చైర్మన్ సాయిప్రసాద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎస్‌బీ డీన్ మదన్ పుస్తక రచయిత కృష్ణమూర్తితో నిర్వహించిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ.. 2014 తర్వాత దేశంలో అమలు చేయబడిన విధానాలతో రాబోయే రెండు దశాబ్దాల్లో 55 వేల ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారనుందన్నారు. దేశంలో 25 సంవత్సరాల తర్వాత ఆర్థిక పరిపుష్టి కోసం మంచి అవకాశాలు లభిస్తున్నాయని ఇది ఇలాగే కొనసాగి భారత్ బలమైన దేశంగా ఏర్పడుతుందన్నారు. ప్రేక్షకులతో కిక్కిరిసిన ఆడిటోరియంలో ఘనంగా పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మదన్ మాట్లాడుతూ.. భారత ఆర్థిక వ్యవస్థ ఎదుగుదల పట్ల ఆసక్తి ఉన్న ఎవరికైనా ఇది అమూల్యమైన పుస్తకమని పేర్కొన్నారు. ఈ పుస్తకంలో సూక్ష్మ ఆర్థికదృష్టి, వృద్ధిపై స్థూల ఆర్థిక ప్రాధాన్యం, సామాజిక ఆర్థిక చేరికపై సూక్ష్మ ఆర్థిక దృష్టి, చర్చించడం జరిగిందని పలువురు కొనియాడారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కృష్ణమూర్తి సుబ్రమణియన్, ప్రొ.మదన్, సాయిప్రసాద్


: విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

డ్రగ్స్‌ను దేశం నుంచి తరిమికొట్టాలి

● విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన కలెక్టర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు వ్యక్తి ఆరోగ్యాన్ని ప్రభావితం చేయడమే కాకుండా వారి కుటుంబాలను, సమాజాన్ని నాశనం చేస్తాయని, ప్రతి ఒక్కరూ దేశాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడానికి కృషిచేయాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ బి.శైలజ అన్నారు. గోల్కొండ ప్రభుత్వ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన శైలజతో పాల్గొని విద్యార్థులతో డ్రగ్స్ ఫ్రీ ఇండియా, డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కోసం సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో, కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం జరగకుండా చూడాలన్నారు. ఎవరైనా అలా చేస్తే వెంటనే సంబంధిత ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వల్ల వ్యక్తి ఆరోగ్యం చెడిపోవడమే కాకుండా, కుటుంబం, సమాజం మొత్తనికి దెబ్బతీస్తుందని అన్నారు. ఇంట్లో, పాఠశాలల్లో మాదకద్రవ్యాల వినియోగం జరగకుండా చూడాలన్నారు. కొవిడ్ మహమ్మారిని తరిమికొట్టినట్లే మాదకద్రవ్యాలను దేశం నుంచి పారదోలాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో జూనియర్ కళాశాలలో డ్రగ్ రహిత తెలంగాణ, డ్రగ్ రహిత భారత్ సాధించేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ ఆర్.రోహిణి, వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, డిప్యూటీ డీఈఓ రమణరాజు, డిప్యూటీ ఐఓఎస్ మావూల్ అహ్మద్, కళాశాల ప్రిన్సిపాల్ మైత్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయిన్ చెరువును

మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేస్తా


చెరువు మ్యాప్‌ను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు12(ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి హస్మత్‌పేట్ బోయిన్ చెరువును సుందరంగా తీర్చిదిద్ది మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు అందరు కలిసికట్టుగా పని చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులకు సూచించారు. సోమవారం కార్పొరేటర్ ముద్దం నర్సింహ్మాయాదవ్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి బోయిన్ చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛదనం - పచ్చదనంలో చెరువు అభివృద్ధికి కూకట్‌పల్లి జడ్సీ రూ2 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. పనుల కోసం టెండరింగ్ ప్రక్రియ మొదలైందని, వాకింగ్ ట్రాక్ లైటింగ్ తదితర పనుల కోసం మరో రూ3 కోట్ల నిధులు కావాలని సీఎంను కోరనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. ఫతేనగర్ రైల్వే బ్రిడ్జి విస్తరణ, ఫతేనగర్ నుంచి సనత్‌నగర్‌కు అండర్‌పాస్ బ్రిడ్జి, భరత్‌నగర్ మార్కెట్ కోసం కైత్లాపూర్‌లోని 5 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని ఇవ్వాలని సీఎంకు వినతిపత్రం అందజేశానని వివరించారు. నర్సాపూర్ చౌరస్తాలో 51 సంవత్సరాల లీజు పూర్తయిన 47 ఎకరాల ప్రభుత్వ స్థలంలో 20 ఎకరాలు కేటాయిస్తే ప్రజలకు ఉపయోగ పడే 100 పడకల ఆసుపత్రి, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, ప్రభుత్వ పాఠశాల భవనాలను నిర్మించుకుంటుమాని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఈఈ గోవర్ధన్‌గౌడ్, డీఈ బాలకృష్ణ, డివిజన్ ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, కర్రెజంగయ్య, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేణుస్వామిపై మహిళా కమిషన్‌కు ఫిర్యాదు

రాంగోపాల్‌పేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో సినీ ప్రముఖులపై వ్యాఖ్యలు చేస్తూ ప్రఖ్యాతి పొందిన వేణుస్వామి ఈ మధ్య జరిగిన అక్కినేని నాగ చైతన్య, శోభిత ధూళిపాళల నిశ్చితార్థం రోజున వారి జాతకాలను విశ్లేషణ చేస్తూ చేసిన వీడియో పెనుధుమారం లేపింది. వేణుస్వామిపై చర్యలు తీసుకోవాలని తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్‌లు సోమవారం ఎంజీ రోడుల్లో బుద్ధభవన్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ కార్యాలయంలో చైర్ పర్సన్ నేరెళ్ల శారదకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ గతంలో సినిమా రిలీజ్‌లపై, రాజకీయ ఫలితాలపై ఇలాంటి వ్యాఖ్యలే చేసి అబాసుపాలైనా బుద్ధి రాలేదని, అసలు వ్యక్తిగత విషయాలు నలుగురిలో మాట్లాడకూడదు అనే జ్ఞానం కూడా లేని వేణుస్వామి వాళ్లు ఎప్పుడు విడిపోతారో కూడా చెప్పేసాడని అన్నారు. ఈ విషయంపై స్పందించిన నేరెళ్ల శారద వేణుస్వామిని పిలిలించి వివరణ అడుగుతామని, ఆయనపై, టెలికాస్ట్ చేసిన యూ ట్యూబ్ చానల్స్‌పైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో తెలుగు ఫిల్మ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి వై.జె.రాంబాబు, కోశాధికారి సురేంద్ర కుమార్ నాయుడు, ప్రసాదం రఘు, లక్ష్మి, తెలుగు ఫిల్మ్ డిజిటల్ మీడియా అసోసియేషన్ అధ్యక్షురాలు వనం ప్రేమమాలిని, కార్యదర్శి వేదుల మూర్తి, సభ్యులు సువర్ణ, తేజస్విని, భాగ్య లక్ష్మి, కుమార్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు వనజ పాల్గొన్నారు.

రాడార్ ప్రాజెక్టుకు రిజర్వ్ ఫారెస్ట్ భూమిని కేటాయించొద్దు



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

పంజాగుట్ట, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను భారత నౌకాదళానికి వెరీ లో ఫ్రీక్వెన్సీ(వీఎల్ఎఫ్) రాడార్ స్టేషన్ కోసం కేటాయించొద్దని వివిధ సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. అనంతగిరి కొండల్లోని సహజమైన అటవీ భూములను వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ కోసం కేటాయించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ట్రూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.కార్తీక్‌యాదవ్, సమన్వయకర్త రాజుయదవ్, భారత్ కిసాన్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు డి.కె.చంద్రశేఖర్‌యాదవ్, గీత, సామాజిక కార్యకర్త రుచిత్ ఆశా కమల్, శ్రీశైలంయాదవ్, ఆదిత్య, లోకేష్, తదితరులు మాట్లాడారు. విశాఖపట్నంలోని తూర్పు నౌకాదళ కమాండ్ (ఈఎన్సీ)ప్రతిపాదించిన వీఎల్ఎఫ్ రాడార్‌స్టేషన్ తక్కువ ఫ్రీక్వెన్సీ రేడియో తరంగాలను ఉపయోగించి నౌకలు, జలాంతర్గాములతో కమ్యూనికేట్ చేస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల వికారాబాద్ జిల్లా పూడూరు మండలంలోని దామగుండం అడవుల్లో 2,900 ఎకరాల అటవీ భూమిలోని 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుందని అన్నారు. ప్రపంచ వాతావరణ సంక్షోభాల రిత్యా దామగుండం అడవుల్లో రాడార్ ప్రాజెక్టును కొనసాగించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు.

స్టాక్ మార్కెట్‌లో లాభాలంటూ యువకుడిని నమ్మించి..

రూ.5.93 లక్షలు కొల్లగొట్టిన సైబర్ క్రిమినల్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్లో లాభాలంటూ నగర యువకుడిని నమ్మించిన సైబర్ క్రిమినల్స్ అతడి నుంచి రూ.5,93,840లను కొల్లగొట్టారు. మోసపోయిన బాధితుడు సోమవారం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. డీసీపీ కవిత తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన 31 ఏళ్ల యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో అతనికి గుర్తుతెలియని నంబర్ నుంచి 'ఎఫ్-20 ఫిడిలిటీ స్టాక్ ఇన్వెస్టిమెంట్ గైడ్' అనే వాట్సాప్ సందేశం వచ్చింది. తాము ఇచ్చే సూచనల ఆధారంగా స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు అందుకోవచ్చు అంటూ.. నమ్మించారు. అది నమ్మిన యువకుడు వారు చెప్పిన సూచనలు పాటిస్తూ.. స్టాక్ మార్కెట్లో వ్యాపారం చేస్తూ కొద్దిమొత్తంలో లాభాలు ఆర్జిస్తున్నాడు. ఆ తర్వాత లైన్‌లోకి వచ్చిన కొందరు వ్యక్తులు ఎఫ్-20 ఫిడిలిటీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే అత్యధిక లాభాలు వస్తాయని నమ్మించారు. ప్రతిరోజూ రాత్రి 8-9 గంటల మధ్య శిక్షణ తరగతులు నిర్వహించి ఆ తర్వాత ట్రేడింగ్‌లో పాల్గొనేలా చేస్తామన్నారు. అలా నమ్మకాన్ని కలిగించిన నిందితులు ఆ తర్వాత 150 మంది సభ్యులున్న గ్రూపులో యువకడిని యాడ్ చేశారు. అలా లాభాలు వస్తున్నట్లు నమ్మించి బాధితుని పేరుతో ఐపీవో షేర్లు కేటాయించారు. అందుకు సరిపడా డబ్బులు లేకపోవడంతో బాధితుడు విరమించుకునే ప్రయత్నం చేయగా ఒప్పుకోలేదు. 150 శాతం లాభాలు వస్తాయని నమ్మించారు. ఆ తర్వాత మంచి లాభాలు వచ్చినట్లు వర్చువల్‌గా చూపించారు. ఆ డబ్బును ఉపసంహరించుకోవాలని చూడగా విత్‌డ్రా ఆప్షన్‌క్లోజ్ చేశారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఐపీవో షేర్లు కేటాయించడానికి మేం చెల్లించన మొత్తంతో పాటు.. వచ్చిన లాభాలపై 10 శాతం కమీషన్ చెల్లించాలని మెలికపెట్టారు. దాంతో బాధితుడు విడతలవారీగా రూ.5,98,840లు చెల్లించాడు. అయినా ఇంకా డబ్బులు చెల్లించాలని ఇబ్బంది పెడుతుండటంతో ఇదేదో మోసంలా ఉందని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని డీసీపీ తెలిపారు.

కిందికుంట పార్కును అభివృద్ధి చేస్తాం: కార్పొరేటర్ నార్నె


వాకర్స్‌తో కలిసి పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

హైదర్‌నగర్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ నిజాంపేట్ హైటెన్షన్ రోడ్డులోని కిందికుంట పార్కును వాకర్స్‌తో కలిసి కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కిందకుంట పార్కులో వాకర్స్‌తో కలిసి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. వాకింగ్‌కు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా ట్రాక్‌ను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఇప్పటికే ఓపెన్‌జిమ్ ఏర్పాటు చేశామని, ఇతర పరికరాలు ఏర్పాటు చేసి పార్కును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హర్‌ఘర్ తిరంగా ర్యాలీలు


నానక్‌రాంగూడలో ర్యాలీలో పాల్గొన్న రవికుమార్‌యాదవ్, బీజేపీ నేతలు

గచ్చిబౌలి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అజాది కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గచ్చిబౌలి డివిజ్ నానక్‌రాంగూడ గ్రామంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీలో కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ నాయకులతో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటిపై మన దేశం గౌవరం, మన జెండా ఎగరాలనే సంకల్పంతో ప్రధాని మోదీ ప్రత్యేకంగా ఈ కార్యక్రమం రూపొందించారన్నారు. వసంత్‌యాదవ్, హనుమంత్‌నాయక్, మీన్‌లాల్, వరలక్ష్మి, శివాసింగ్, వినితాసింగ్, గోపాల్, కిషన్, రంజిత్, సీతా, కవితా భాయి, సంకేశ్, బబ్లూ, నరసింహ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

షాపూర్‌నగర్: బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా ఆదేశాలతో మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ మల్కాజిగిరి అర్బన్ జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి పాల్గొని జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని షాపూర్‌నగర్ చౌరస్తా నుంచి ఐడీపీఎల్ వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో నియోజకవర్గం అసంబ్లీ కన్వీనర్ జేకే.శేఖర్‌యాదవ్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట అలివేలు, బీజేపీ మహిళా మెర్చా నాయకురాలు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీలో..

హైదర్‌నగర్: హర్‌ఘర్ తిరంగా యాత్ర ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ప్రోగ్రాం కోఆర్డినేటర్ శైలేష్ ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగింది. ఈ పాదయాత్రలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుమార్ యాదవ్, నాయకులు నర్సింగ్‌యాదవ్, నరసింహ చారి, రాహుల్, అనూష, రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.